క్లుప్తంగా

వాలీబాల్ శిక్షణ శిబిరం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గౌరవెల్లిలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సౌజన్యంతో నిర్వహిస్తున్న వాలీబాల్ క్రీడా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని శిక్షకులు జంగపల్లి వెంకటనర్సయ్య సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ గౌరవెల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో నెల రోజుల పాటు శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. 14 యేళ్ల విద్యార్థులు పాల్గొనాలని, మరిన్ని వివరాలకు 94419 25763, 85228 21102 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆకునూరులో ఇంటింటి సర్వే



మాట్లాడుతున్న ఎంపీడీఓ మహబూబ్ అలీ

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో భాగంగా అధికారులు గురువారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఎంపీడీఓ మహబూబ్ అలీ పంచాయతీ కార్యదర్శి సందీప్‌కుమార్‌తో కలిసి దరఖాస్తుదారుల అర్హతలను నమోదు చేసుకొన్నారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నానిబాబు, గ్రామశాఖ అధ్యక్షుడు రాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యురాలు రాజేశ్వరి పాల్గొన్నారు.

న్యాయమూర్తి పూజలు

వర్గల్(గజ్వేల్): శ్రీవిద్యాసరస్వతి క్షేత్రాన్ని గురువారం గజ్వేల్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ స్వాతిగౌడ్ దంపతులు సందర్శించారు. గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదం అందజేశారు. శేషవస్త్రంతో సన్మానించారు.

విద్యార్థినికి సన్మానం



విద్యార్థినిని సత్కరిస్తున్న నరేశ్

సిద్దిపేటఅర్బన్: పదో తరగతి ఫలితాల్లో 570 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచిన బక్రిచెప్యాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని మీర్జా సఫూరాను గ్రామస్తులు గురువారం సన్మానించారు. గ్రామానికి చెందిన గందె నరేశ్ ఆ విద్యార్థినిని శాలువాతో సత్కరించి నగదు బహుమతి అందజేశారు. పాఠశాలలో తొమ్మిది మంది విద్యార్థులు 500పైగా మార్కులు రావడానికి కృషిచేసిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

తాగునీటి సరఫరాకు పైపు అందజేత



పైపు అందజేసిన శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): మండలంలోని బంజేరుపల్లి తాగునీటి సరఫరా కోసం 800 మీటర్ల పైపును కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి గురువారం అందజేశారు. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ధమ్మసముద్రం చెరువులో బోరు అమర్చారు. అక్కడి నుంచి గ్రామంలోని వాటర్ ట్యాంకు వరకు సరిపడా పైపును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య తీర్చేందుకు కృషిచేస్తున్నామన్నారు. ఆయన వెంట కొండల్‌రెడ్డి, స్వామి, ప్రవీణ్‌కుమార్, నరేందర్‌రెడ్డి, సాయి, నిరంజన్, భరత్, భాస్కర్, ఆంజనేయులు, బాబు, యాదగిరి, కనకయ్య, స్వామి, భాను, మల్లేశం ఉన్నారు.

చదువుల్లో రాణిస్తేనే గుర్తింపు



అరవిందను సన్మానిస్తున్న లక్ష్మణ్

గజ్వేల్‌రూరల్: చదువుల్లో రాణించినపుడే గుర్తింపు లభిస్తుందని తలకొక్కుల లక్ష్మణ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని సంగుపల్లికి చెందిన విద్యార్థిని అరవిందను గురువారం ఘనంగా సన్మానించారు. ఆమె ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో 470 మార్కులకు గానూ 467 సాధించి రాష్ట్రస్థాయి ద్వితీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా గజ్వేల్‌లో తలకొక్కుల చంద్రకళ-లక్ష్మణ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.5 వేలు అందించారు. కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు బాల్‌చంద్రం ట్రస్టు సభ్యులు దుర్గాప్రసాద్, భాగ్యలక్ష్మి, కృష్ణకాంత్, నాగమణి, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా..

ప్రభుత్వ పాఠశాలలే మేటిగా..

- వికసించిన విద్యా కుసుమాలు
- 'పది' ఫలితాలలో సత్తా చాటిన విద్యార్థులు
- సర్కార్ పాఠశాలల్లో శతశాతం ఉత్తీర్ణత
- ఫలించిన ఉపాధ్యాయుల కృషి

పదో తరగతి ఫలితాలలో సర్కార్ బడుల్లో చదివే విద్యార్థులు సత్తా చాటారు. దాదాపుగా వారంతా వ్యవసాయం, కూలీ పనులు చేసుకొనే వారి పిల్లలే. ఆర్థిక స్థోమత లేకున్నా అధైర్య పడలేదు. సమస్యలు పట్టి పీడిస్తున్నా వెనకడుగు వేయలేదు. వారికి నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల కృషి, పట్టుదల కూడా తోడయింది. క్రమశిక్షణ ఉంటే చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా తమ ప్రతిభ చాటారు.



విద్యార్థులకు పత్యేక తరగతులు(ఫైల్)



తెలంగాణ మోడల్ స్కూల్ మిరుదొడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోను పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు 99శాతం ఫలితం సాధించి ఔరా అనిపించారు. మండల పరిధిలో ఏడు ఉన్నత పాఠశాలలు, ఒక తెలంగాణ మోడల్ స్కూల్, ఒక గురుకుల బాలుర ఉన్నత పాఠశాల, ఒక కేజీబీవీ పాఠశాల ఉంది. 343 మంది విద్యార్థులకు గాను 339 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

ఉపాధ్యాయుల కృషి

వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడంలో ఉపాధ్యాయుల కృషి అంతాఇంతా కాదు. అలాగే తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా లభించడంతో మంచి ఫలితాలు రాబట్టారు. ప్రతి విద్యార్థిపై గురువులు వ్యక్తిగత దృష్టి సారించారు.

ప్రత్యేక తరగతులు

ఉదయం, సాయంత్రం వేళల్లో ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులను మెరికలుగా మార్చారు. వెనుకబడ్డ విద్యార్థులపై మరింత శ్రద్ధ చూపారు. వారిలో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి ఆట పాటలు, స్కిన్, గోడలపై చిత్రించిన బొమ్మలు, చార్టులు, ప్రయోగశాలల్లోని బోధనా పరికరాలను వినియోగించారు. ప్రోత్సహించే తల్లిదండ్రులు, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల కృషితో సర్కార్ బడులు అత్యుత్తమ ఫలితాలు సాధించాయి.

ఆదర్శంగా నంగునూరు విద్యార్థులు



సాధించిన మార్కుల పత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

నంగునూరు(సిద్దిపేట): ఉపాధ్యాయుల చేసిన కృషితో నంగునూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు అందరికీ ఆదర్శంగా నిలిచారు. పదో తరగతి ఫలితాలలో 22 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారని హెచ్‌ఎం రామస్వామి చెప్పారు. మండల రెండో ర్యాంక్, పాఠశాల టాపర్‌గా నిలిచిన లిఖిత్‌రెడ్డితోపాటు ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను గురువారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతి, రాజు, రామ్‌గోపాల్‌రెడ్డి, గణేశ్, రాజమౌళి, మధుసూదన్‌రెడ్డి, సుధాకర్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది



తల్లిదండ్రులతో శృతి

ఉపాధ్యాయులు బోధించిన ప్రతి పాఠ్యాంశాన్ని ఎంతో ఇష్టంగా చదివాను. తమపై ప్రత్యేక దృష్టి సారించి సులభశైలిలో విద్యాబోధన చేయడం అర్థవంతంగా అనిపించింది. ఎప్పటి సందేహాలను అప్పుడే నివృత్తి చేసుకోవడానికి ప్రత్యేక తరగతులు ఎంతో దోహద పడ్డాయి. అలాగే తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించారు. దీంతో పది ఫలితాల్లో 554 మార్కులతో మండల టాపర్‌గా నిలవడం సంతోషంగా ఉంది.

\- నంద్యాల శృతి, మండల టాపర్

సమష్టి కృషి ఫలించింది



మోడల్ స్కూల్‌లో చదివే ప్రతి పదోతరగతి విద్యార్థిపైనా ప్రత్యేక శ్రద్ధ చూపి వార్షిక పరీక్షల కోసం సన్నద్ధం చేశాం. విద్యార్థులను తీర్చి దిద్దడంతో ఉపాధ్యాయులంతా తీవ్రమైన కృషి చేశారు. మొత్తం 96 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో శతశాతం ఫలితాలను రాబట్టాం. 14 మందికి పైగా 500 మార్కులు సాధించారు. మెరుగైన ఫలితాలను రాబట్టేందుకు ఉపాధ్యాయులు చేసిన సమిష్టి కృషి ఫలించింది.

\- అర్చన ప్రియదర్శిని, తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, మిరుదొడ్డి

ఉపాధ్యాయుల శ్రమ వృథాకాలేదు



ప్రణాళికాబద్ధంగా బోధించడం వల్లే మంచి ఫలితాలు వచ్చాయి. ఉదయం, సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక తరగతులు ఎంతో దోహదపడ్డాయి. విద్యార్థుల్లో వార్షిక పరీక్షల భయం పోగొట్టడానికి స్లిప్ టెస్టులతో పాటు ప్రి ఫైనల్ పరీక్షలు నిర్వహించాం. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాం. ఉత్తమ ఫలితాలను రాబట్టడంతో ఉపాధ్యాయులు పడ్డ శ్రమ వృథా కాలేదు.

\- ప్రవీణ్‌బాబు, ఎంఈఓ, మిరుదొడ్డి

అవినీతి ఆరోపణలు హాస్యాస్పదం

- నిరూపిస్తే చైర్మన్ పదవికి రాజీనామా
- బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

సిద్దిపేటజోన్: కాంగ్రెస్ కౌన్సిలర్లు.. ఆ పార్టీ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని, మున్సిపల్‌లో అవినీతి జరిగిందని ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందని బీఆర్‌ఎస్ మున్సిపల్ కౌన్సిలర్లు మండిపడ్డారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం రాత్రి నిర్వహించిన విలేకరుల సమావేశంలో కౌన్సిలర్లు లక్ష్మణ్, ప్రవీణ్, మల్లికార్జున్, మోహిజ్, నాగరాజురెడ్డి, సాయి, బ్రహ్మం, వినోద్, సాయి ఈశ్వర్, రాజు, నాగరాజు మాట్లాడారు. అవినీతి జరిగిందని కాంగ్రెస్ నాయకులు నిరూపిస్తే తమ పార్టీ చైర్మన్ పదవి నుంచి తప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నారని సవాల్ విసిరారు. మున్సిపల్‌కు నిధులు తేవడంలో అధికార కౌన్సిలర్లు విఫలమయ్యారని, ధైర్యం ఉంటే ప్రభుత్వంతో మాట్లాడి నిధులు తేవాలన్నారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమీక్షకు ఎమ్మెల్యే హోదాలో హరీశ్‌రావు హాజరైతే తప్పు ఏమిటని ప్రశ్నించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా, మంచి సేవలు అందించాలని ఎమ్మెల్యే దిశానిర్దేశం చేసినట్టు చెప్పారు. మహిళలతో బీఆర్‌ఎస్ ఎప్పుడూ అగౌరవంగా వ్యవహరించలేదని చెప్పారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండల పరిధిలోని శ్రీరాములపల్లి ఉన్నత పాఠశాలలో 2009-10లో పదో తరగతి చదివిన విద్యార్థులు గురువారం ఆత్మీయసమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొన్నారు. అనంతరం తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోండి

ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నేత బీరన్న

చేర్యాల(సిద్దిపేట): ఎలాంటి అనుమతి లేకుండా పట్టణంలో చేపడుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్న మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిటీ చైర్మన్ అందె బీరన్న డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా ఇళ్లు నిర్మిస్తున్న వారి నుంచి లంచాలు తీసుకొంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. కిందిస్థాయి సిబ్బంది సహకారంతో వసూళ్లు చేయిస్తూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. ఆ కమిషనర్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శ్రమకు గౌరవం.. మేడే సందేశం

అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం మేడేను జిల్లా వ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు ఎర్రజెండాలను ఆవిష్కరించారు. సీపీఐ, సీపీఎం ఇతర పార్టీలు, సంఘాల నాయకులు ర్యాలీలు నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ శ్రామికులు పోరాటానికి దక్కిన గౌరవమే మేడే అని వ్యాఖ్యానించారు. మేడే స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు.



వర్గల్(గజ్వేల్): మేడే వేడుకల్లో పాల్గొన్న భవన నిర్మాణ కార్మికులు



హుస్నాబాద్‌రూరల్: పందిల్ల గ్రామంలో జెండా ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నేత మల్లికార్జున్‌రెడ్డి



గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నేత నర్సింహులు



హుస్నాబాద్: జెండా ఆవిష్కరిస్తున్న సింగిల్ విండో చైర్మన్ శివయ్య



బెజ్జంకి పంచాయతీ సిబ్బందిని సన్మానిస్తున్న సత్యలక్ష్మి, మాజీ సర్పంచ్ మంజుల



కొమురవెల్లిలో సీపీఐ నేత బాలమోహన్ జెండా ఆవిష్కరణ



కొండపాక(గజ్వేల్): మంగోల్‌లో సఫాయి కార్మికులకు కాంగ్రెస్ నేతల సన్మానం

హక్కులను కాపాడుకొందాం



మాట్లాడుతున్న డీబీఎఫ్ జాతీయ నేత శంకర్

గజ్వేల్‌రూరల్: రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకొందామని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని బయ్యారంలో ఉపాధి హామీ కూలీలతో కలిసి గురువారం మేడే సంబురాలను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌ల పేరుతో సామాజిక భద్రత లేకుండా చేస్తుందని ఆరోపించారు. 100 నుంచి 200 రోజులకు ఉపాధి పనిదినాలను పెంచాలని, రూ.317 నుంచి రూ.700లకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఏగొండస్వామి, వేణు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



నంగునూరులో జెండా ఎగురవేసి వేడుకలు జరుపుకొంటున్న కార్మికులు



చిన్నకోడూరులో కార్మిక జెండా ఎగురవేస్తున్న కార్మికులు, నాయకులు

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

రాష్ట్ర నాయకుడు కిరణ్‌కుమార్‌గౌడ్



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో కిరణ్‌కుమార్‌గౌడ్ తదితరులు

చేర్యాల(సిద్దిపేట): పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలిచిందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. స్థానిక షాదీఖానాలో చేర్యాల ప్రాంతానికి చెందిన 24 మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.10 లక్షల విలువగల చెక్కులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, పార్టీలకతీతంగా పేదలకు అండగా నిలుస్తోందన్నారు. నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన చాలా మందికి సీఎం సహాయ నిధి నుంచి సహాయం అందేలా కృషిచేశానని చెప్పారు. కేంద్రం చేస్తానన్న కులగణన తెలంగాణ ప్రభుత్వ ఒత్తిడితోనే జరుగుతోందని తెలిపారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, లలిత, రవిచందర్, చందర్, రాజ్‌కుమార్, రవినాయక్, దామోదర్, మల్లేశ్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి సీఎం కృషి

తొగుట(దుబ్బాక): పేదల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. పెద్ద మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన మెరుపుల పద్మకు రూ.60 వేలు, గుడికందుల గంట లక్ష్మికి రూ.22 వేలు, వెంకట్రావుపేట కోహెడ సాగర్‌కు రూ.34 వేలు చెక్కులను అందజేశారు.

పేదలకు వరం

మర్కూక్(గజ్వేల్): సీఎం సహాయనిధి పేద ప్రజలకు వరంగా మారిందని మాజీ ఎంపీపీ పాండుగౌడ్ అన్నారు. మండలంలోని పాములపర్తికి చెందిన షేక్ షాదుల్లాకు మంజూరైన రూ. 24 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నర్సింహులు, బాలయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ తగాదాల్లో తలదూర్చొద్దు

త్రీటౌన్ సీఐ విద్యాసాగర్



నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ విద్యాసాగర్

సిద్దిపేటఅర్బన్: నేర చరిత్ర కలిగిన వారు సివిల్ తగాదాల్లో తలదూర్చొద్దని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని కేడీలు, డీసీలు, రౌడీలు, సస్పెక్ట్‌లకు గురువారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సత్ప్రవర్తనతో మెలగాలని, సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, సత్ప్రవర్తన కలిగిన వారికి పోలీసుల సహాయ సహకారాలు ఉంటాయని భరోసా ఇచ్చారు. సస్పెక్ట్‌లపై నిరంతరం నిఘా ఉంటుందని చెప్పారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని, ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ ఆడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చంద్రయ్య, సిబ్బంది నరేశ్, శ్రీనివాస్ ఉన్నారు.

ఆ యూనివర్సిటీల గుర్తింపు రద్దు చేయండి

యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకులు



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: ఐకార్(భారత వ్యవసాయశాఖ పరిశోధన సంస్థ) నుంచి ఎలాంటి అనుమతి పొందని ప్రైవేటు యూనివర్సిటీల గుర్తింపును రద్దు చేయాలని యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రవి, తిరుపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడారు. ఐకార్ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండానే కావేరితో పాటు మరికొన్ని యూనివర్సిటీలు అగ్రికల్చర్ కోర్సులు నిర్వహిస్తున్నాయని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తూ అడ్మిషన్లు జరుపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల అండదండలతోనే ప్రైవేటు యూనివర్సిటీల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వం ప్రత్యేకంగా విజిలెన్స్ కమిటీని నియమించి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించని యూనివర్సిటీలపై కేసు నమోదుచేసి వాటి గుర్తింపును రద్దుచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుమన్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.